# మురిపించిన కూచిపూడి స్వర్ణోత్సవ సదస్సు

ప్రభాతవార్త, సిటీబ్యూరో
హైదరాబాద్, మార్చి 1

సరిగ్గా యాభై ఏళ్ళ క్రితం జరిగిన తొలి కూచిపూడి సదస్సు ముచ్చట్లు గుర్తు చేసుకుని నాట్యలోకం మురిసిపోయింది. నాట్యాచార్య నటరాజ రామకృష్ణ కన్వీనర్‌గా తిలక్ మెమోరియల్ హాలులో జరిగిన ఆ నాటి సదస్సులో జరిగిన ఆరు విభాగాలను ఆనాటి వక్తలే జ్ఞప్తికి తీసుకురాగా ప్రముఖ నర్తకీమణులు, నేటితరం నర్తకులు పులకించిపోయారు. ఆ వేదికపై నటరాజ రామకృష్ణ ప్రదర్శనను ఇప్పటి ప్రేక్షకులు స్క్రీన్‌పై తిలకించి పరవశించిపోయారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్, ఫైనార్ట్స్, నృత్యవిభాగం ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో కూచిపూడి స్వర్ణోత్సవ సదస్సు కనులపండువగా జరిగింది. తొలి కూచిపూడి సదస్సులో పాల్గొన్న డాక్టర్ నటరాజ రామకృష్ణ, పసుమర్తి వేణుగోపాలకృష్ణ శర్మ, డాక్టర్ సునీల్ కొఠారి, ఆచార్య మొదలి నాగభూషణ శర్మ తదితరులంతా పాల్గొని ఆనాటి తీపి విశేషాలను వివరించి తన్మయులను చేశారు. తొలుత ట్యాంక్‌బండ్‌పైనున్న సిద్ధేంద్రయోగి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి రవీంద్రభారతి వేదికకు తరలివచ్చారు. ఆచార్య జొన్నలగడ్డ అనురాధ సమన్వయకర్తగా వ్యవహరించి ఆ తీపి జ్ఞాపకాన్ని మరోసారి గుర్తు చేసి మైమరపించారు. కూచిపూడి నాట్యం జానపదం అంటూ దేశ రాజధాని ఢిల్లీలో మహానుభావులంతా చిన్నచూపు చూడగా, ఆ మరుసటి సంవత్సరమే ఇది పూర్తిగా శాస్త్రీయబద్ధమైన సంప్రదాయ నాట్యంగా నిరూపించడంలో నాట్యాచార్యులంతా కృషి చేసిన వైనాన్ని ఆచార్య మొదలి నాగభూషణ శర్మ ఉత్తరాల సాక్షిగా వినిపించి అందరిలో సరికొత్త చైతన్యాన్ని రగిలించారు. 1958 డిసెంబర్ 14న ఢిల్లీలో జరిగిన నాట్య సదస్సు గురించి, 1959 ఫిబ్రవరి 28, మార్చి 1న రెండు రోజుల పాటు తిలక్ హాలులో జరిగిన కూచిపూడి సదస్సు గురించి విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. ఆ సమావేశాల్లో పాల్గొనడం ఒకగొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నటరాజ రామకృష్ణ, బందా కనకలింగేశ్వరరావు, పిఎస్ఆర్ అప్పారావు, చింతా కృష్ణమూర్తి, పివిజి కృష్ణశర్మ తదితరులంతా చేసిన కృషిని ఆయన కొనియాడారు. 1960లో జరిగిన కూచిపూడి మహత్తర జైత్రయాత్ర గురించి చెప్పి హృదయాలను ఉప్పొంగించారు. మారంపల్లి సిస్టర్స్ వైదేహి, ఇందువదన చేసిన గొల్లకలాపం చూసి తరించిపోయిన విషయాన్ని ఆయన కళ్ళ ముందు కదలాడించారు. కూచిపూడి నాట్యాన్ని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వికసించేందుకు కృషి చేయాలని నాట్యాచార్యులను ఆయన కోరారు. తొలితరం గురువులను స్మరించుకోవడం గొప్ప సంప్రదాయం అని, ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు.



కూచిపూడి స్వర్ణోత్సవ సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ పప్పు వేణుగోపాలరావు. చిత్రంలో డాక్టర్ నటరాజ రామకృష్ణ, పసుమర్తి వేణుగోపాలకృష్ణశర్మ, డాక్టర్ మొదలి నాగభూషణశర్మ తదితరులు. పక్కన ట్యాంక్‌బండ్‌పైనున్న సిద్ధేంద్రయోగి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తున్న నాట్యాచార్యులు, నర్తకీమణులు

### విస్తృత చర్చ జరగాలి : నటరాజ రామకృష్ణ

చర్చతోనే నాట్యం నిలబడుతుంది, విస్తృత జరిగితేనే నాట్య వికాసం కలుగుతుందని పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. స్త్రీల నాట్యం లాస్యం, పురుష నాట్యం తాండవంకు తేడా తెలుసుకోవాలి, పరిశోధన చేయాలంటూ ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. భాగవతులు, కచేరి శైలి, వర్ణాలు, విన్యాసాలు, గమకాల సొగసు తదితర శాస్త్రీయ విషయాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. మేకప్ లేకుండా అభినయం చేయగలగాలి. హస్తాభినయం, సాత్వికాభినయం తేడా తెలుసుకోవాలి. కూచిపూడి బాణీ వాయించే మృదంగ విద్వాంసులు ఒక్కరైనా ఉన్నారా అని ఆయన ప్రశ్నించారు. సాత్వికాభినయం కళ్ళలోంచి రావాలి. నాట్యమంటే హృదయ వికాసం కలిగించాలి. నాట్యబాణీలు వేరు, ఏ నాట్యంతో దేనికీ పోలిక వద్దు. సంచారి భావ అభినయం నేర్చుకోవాలి. భగవంతుడ్ని కళ ద్వారానే చూడాలి. నాట్యమూలాలను తెలుసుకోవాలంటూ నటరాజ రామకృష్ణ హితవు పలికారు. ఆచార్య పి.వి.జి.కృష్ణశర్మ మాట్లాడుతూ నృత్యం ఒక దైవం అని, శాస్త్రీయమైన తరంగాలు, అష్టపదుల్లాంటివే చిరస్థాయిగా నిలుస్తాయని చెప్పారు. 1953లో తొలి నాట్య శిక్షణాలయంను తానే ప్రారంభించినట్లు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో నాట్య విమర్శకులు డాక్టర్ సునీల్ కొఠారి తదితరులు పాల్గొని తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా ఆనాటి చింతా కృష్ణమూర్తి ప్రహ్లాదలో పాడిన అంబ పరాకు, భామాకలాపంలో ప్రదర్శించిన మదన దరువు, గొల్ల కలాపంపై చర్చ ఆడియో వినిపించడం అందరినీ ఆకర్షించిన విశేషాంశం. మధ్యాహ్నం జరిగిన రెండవ సదస్సుకు డాక్టర్ పప్పు వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. భాగవతుల లక్ష్మీ నరసింహం, డాక్టర్ ఉమారామారావు, కొత్తపల్లి పద్మ, వేదాంతం రాధేశ్యాం, పసుమర్తి కేశవప్రసాద్, పసుమర్తి రామలింగశాస్త్రి, డాక్టర్ అలేఖ్య, లీలా వెంకటరామన్, డాక్టర్ ఎం.ఎస్.శివరాజు తదితరులు ప్రసంగించారు. వేదాంతం వెంకటచలపతి బృందం ప్రదర్శించిన భామాకలాపంతో ఈ సదస్సుకు గొప్ప ముగింపు పలికారు. ఆచార్య జొన్నలగడ్డ అనురాధ, ఆచార్య వినోద్ పవరాల, ఆచార్య బి.పి.సంజయ్ తదితరులు పర్యవేక్షించారు